క్లుప్తంగా

ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



జొన్నాడ షిర్డీసాయి ఆలయంలో పండితుల ఆశీర్వచనాలు అందుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ సాయి 15వ ఆలయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య షిర్డీసాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ కమిటీ నేతృత్వంలో భారీ అన్నసమారాధన జరిగింది. సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి, గొలుగూరి సూర్రెడ్డి, గొలుగూరి సత్తిరెడ్డి, సత్తి ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మళ్లీ సీఎంగా విజయపథంలో నిలపాలని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం తాటిపాకలోని కనకదుర్గ ఆటో యూనియన్ సభ్యులను గొల్లపల్లి సూర్యారావు కలుసుకొన్నారు. ఆటో యూనియన్ నాయకులు గొల్లపల్లిని సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. గొల్లపల్లి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాహనమిత్ర పథకం ద్వారా ఆటోడ్రైవర్లను, ట్యాక్సీ డ్రైవర్లను ఆదుకున్నారన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తామని ఆటో యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కనపాల బాబురావు, యూనియన్ అధ్యక్షుడు బొక్కా శ్రీను, ఉపాధ్యక్షుడు మహంకాళి వెంకటేశ్వర్లు, కార్యదర్శి యాండ్ర కృష్ణ పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా



చింతలూరులో రాజీనామా పత్రాలను డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేస్తున్న వలంటీర్లు

ఆలమూరు: సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో పేద ప్రజలకు తమ వంతు సేవలు చేయాలన్న దృఢ సంకల్పంతో గౌరవం వేతనం తీసుకుంటూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న గ్రామ వలంటీర్లపై టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలు, అవమానాలు, కుట్రలు, కుతంత్రాలు, జుగుప్సాకర విధానాలకు విసుగు చెంది మూకుమ్మడి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని చింతలూరుకు చెందిన గ్రామ వలంటీర్లు తెలిపారు. ఈమేరకు స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం డిజిటల్ అసిస్టెంట్ గంగుల బాలామణి జ్యోతికి అందజేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న కుటిల పన్నాగాలు తెలియని పింఛన్ లబ్ధిదారులు మా పింఛన్ సొమ్మును ఎందుకు తెచ్చి ఇవ్వడం లేదని అడుగుతుంటే కన్నీటి పర్యంతమవుతున్నారు. దేశ వ్యాప్తంగా గ్రామ వలంటీర్ వ్యవస్థపై ప్రశంసలు లభిస్తుంటే రాష్ట్రంలో మాత్రం బురదజల్లుతున్నారని దుయ్యబట్టారు. అందుకే గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలోని 21 మంది మూకుమ్మడి రాజీనామా చేశామన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థపై బురద జల్లుతున్న ప్రతిపక్ష పార్టీల నిజ స్వరూపం బయట పెడతామని వారు హెచ్చరించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

అంబాజీపేట: ఇటీవల పుల్లేటికుర్రు శివారు వాజ్‌పేయి కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయం అందజేశారు. బాధితుడు గాడ నాగబాబుకు రూ.12 వేల నగదు, బెడ్‌షీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ లయన్స్ వేలూరి సూర్యనారాయణ, బి.హనుమంతరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిరసన

మామిడికుదురు: ఉగ్రవాదాన్ని సమస్త మానవ జాతి వ్యతిరేకించాలని నగరం గ్రామానికి చెందిన ముస్లింలు డిమాండ్ చేశారు. నగరం గ్రామంలోని పంజీషా వద్ద ఖుద్స్ డే సందర్భంగా శుక్రవారం తీవ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇజ్రాయెల్, అమెరికాలు అమాయకులైన పాలస్తీనియులపై పలు సంవత్సరాలుగా తీవ్రవాద చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. ఈ దాడుల్లో ఎంతో మంది చిన్నారులు, మహిళలు, అమాయకులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ తీవ్రవాద దాడులు ఆపాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇలియాస్ హుస్సేన్, సయ్యద్ రజ్వి, ఇస్మాయిల్, సయ్యద్ రూహి, జావేద్ మెహది, గుల్షన్, మొహ్మద్ అలీబేగ్, షబ్బీర్ హుస్సేన్, అబుల్ హుస్సేన్, ముర్తజా హైదర్, అబ్బాస్ హైదర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్



జొన్నాడలో బాబూ జగజ్జీవన్‌రామ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు



ఈదరాడలో జగ్జీవన్‌రామ్‌కు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు నివాళి



అంబాజీపేటలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు

- నివాళులర్పించిన ఎమ్మెల్యే అభ్యర్థులు గొల్లపల్లి, విప్పర్తి, చిర్ల
- ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

మామిడికుదురు: మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్ మంచి సంఘ సంస్కర్త అని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి గొలపల్లి సూర్యారావు శ్లాఘించారు. ఈదరాడ చాకిరేవు చెరువు ప్రాంతంలో వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి చేట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం జరిగింది. జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి గొలపల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏప్రిల్ నెల బడుగు, బలహీన, పీడిత, తాడిత ప్రజానీకానికి పండగ నెల అన్నారు. బీఆర్ అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయులు పుట్టిన నెల అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు యెరుబండి సూరిబాబు, కటకంశెట్టి ఆదిత్య, యెరుబండి సత్యనారాయణమూర్తి, వడ్డే ఆదిబాబు, ముస్కూడి అభిమన్యుడు, ఈతకోట త్రిమూర్తులు, ముసూడి చిన్ని, కుసుమ పెరుమాళ్లకుమార్, గెడ్డం రవి, దాసరి కిరణ్ పాల్గొన్నారు.

తాటిపాకలో..

రాజోలు: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిదాయకుడని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం తాటిపాక సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతిలో ఆయన పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోషల్‌మీడియా కన్వీనర్ పాటి శివకుమార్, సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు ఉల్లంపర్తి భాస్కరరావు, అడబాల జానకీరామ్, నాగిరెడ్డి గోపి, బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.



రాజోలులో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

అంబాజీపేటలో..

అంబాజీపేట: దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు నేటి తరం యువత కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా అంబాజీపేటలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, స్థానిక బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ఉందుర్తి నాగబాబు తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగ్జీవన్‌రామ్ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, అప్పన శ్రీను, కుసుమ శ్రీను, చిల్లి ధనరాజ్, సూదాబత్తుల రాము, గంటి శ్రీరామచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

రాజోలు: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాజోలులోని బీసీ హాస్టల్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, సహ కార్యదర్శి రాజా నాగరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజోలు బార్ అసోసియేషన్‌లో అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రెసిడెంట్ చింతా ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు సిర్రా వెంకటేశ్వర్లు, గుబ్బల రజిత, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దిగుమర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడలో..

ఆలమూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, అంటరానితనం నిర్మూలనకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి, హరిత విప్లవ సాధనకు అలుపెరగని కృషి చేసిన సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిని నేటి పాలకులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని జొన్నాడ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి జగ్జీవన్‌రామ్ అభిమానులను పంచారు. ఆయన దేశానికి చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో మాగాం, తొత్తరమూడి, అయినవిల్లి తదితర గ్రామాల్లో జరిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

కోడ్ అమలులో ఉంది



డీఎస్పీ రమణ

కొత్తపేట: అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల కార్యక్రమాలకే కాకుండా శుభకార్యాలకు కూడా పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి వుంటుందని స్థానిక డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. శుక్రవారం డీఎస్పీ రమణ ఒక ప్రకటన విడుదల చేశారు. మోడల్ కోడ్ అమలులో భాగంగా స్థానిక పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆయా రిటర్నింగ్ అధికారుల అనుమతులు లేకుండా రాజకీయ పార్టీల నాయకులు ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ఎలక్షన్ క్యాంపెయిన్లు, పార్టీల తాత్కాలిక కార్యాలయాలు ప్రారంభం చేపట్టరాదని పేర్కొన్నారు. అలాగే ఎన్నికలకు సంబంధం లేని కుటుంబాల వారు బంధుమిత్రులతో కలిసి నిర్వహించుకునే ఏ శుభకార్యక్రమానికైనా పోలీస్ సబ్ డివిజన్ అధికారిగా తన అనుమతి విధిగా తీసుకోవాలని, కార్యక్రమాల్లో దేనికీ కూడా డీజే సౌండ్ సిస్టంలకు అనుమతి లేదని పేర్కొన్నారు. వాటిని ఉపయోగిస్తే పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఒకవేళ సౌండ్ సిస్టం అవసరం అయితే ఒక రోజుకు రూ.100 చలానా చెల్లించి తన నుంచి ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేశారు.

అనుమతులు తప్పనిసరి

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ఎలక్షన్ క్యాంపెయిన్లు, టెంపరరీ పార్టీ కార్యాలయాలు ప్రారంభోత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు 144 సెక్షన్, 30 అమలులో ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధం లేని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి నిర్వహించుకునే ఏ శుభకార్యానికైనా కొత్తపేట డీఎస్పీ వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



ఈదరాడలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి

మామిడికుదురు: ఈదరాడలోని కళింగులపేటకు చెందిన పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సమక్షంలో వారు పార్టీలో చేరారు. వారికి గొల్లపల్లి పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. చుట్టుగుళ్ల వంశీ, ముస్కూడి శ్యామ్, నరేష్, మహేష్, కలిగిత రవీంద్రనాథ్, కుమార్, పోతుల నాగార్జున, యల్లమెల్లి ప్రసాద్, చుట్టుగుళ్ల ప్రసాద్, రొక్కాల నాగకృష్ణ, వరప్రసాద్ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారని పార్టీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మెచ్చి ఎంతో మంది పార్టీలో చేరుతున్నారని గొలపల్లి పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు చేట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రాపాక, గొల్లపల్లి విజయమే లక్ష్యం

రాజోలు: రాబోయే ఎన్నికల్లో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుల విజయమే లక్ష్యంగా కృషి చేస్తామని ములికిపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వెల్లడించారు. శుక్రవారం గ్రామశాఖ అధ్యక్షుడు దొమ్మేటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాపాక మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి విభేదాలకు తావులేకుండా కలసికట్టుగా పని చేయాలన్నారు. గొల్లపల్లి మాట్లాడుతూ అమలాపురం పార్లమెంట్, రాజోలు అసెంబ్లీ స్థానాల విజయాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా అందజేయాలన్నారు.



ములికిపల్లి పార్టీ సమావేశంలో పాల్గొన్న రాపాక, గొల్లపల్లి

జెడ్పీటీసీ మట్టా శైలజ, మాజీ సర్పంచ్ తాడి సత్యనారాయణ, నాయకులు పరంశెట్టి ఏడుకొండలు, దొమ్మేటి నాగేశ్వరరావు, మంగెన సింహాద్రి, బండారు కాశీ, చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

అందరి మంచికోరే జగనన్నను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు

అంబాజీపేట: కులమతాలు, పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, అందరి మంచిని కోరే జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అంబాజీపేట వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక మసీదులో ముస్లింలను ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని ప్రార్థనలు నిర్వహించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని గత 58 నెలల్లో 99 శాతం అమలు చేసి రాజకీయాలంటే ప్రజలకు విశ్వసనీయత నెలకొల్పారన్నారు. కరోనా సమయంలో దేశంలో పలు రాష్ట్రాలు ఆర్థికభారంతో సతమతం అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్లో మాత్రం సీఎం జగన్ సంక్షేమ పథకాల అమలు చేసి ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగే విధంగా చర్యలు చేపట్టారన్నారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి 11 మంది వివిధ శాఖల ఉద్యోగులను నియమించి ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలకు ఇంటిముంగిటకే అందజేసిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని డీబీటీ ద్వారా అవినీతి అక్రమాలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా పెద్ద పీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అమలాపురం పార్లమెంట్ అభ్యర్థిగా రాపాక వరప్రసాదరావులకు ఫ్యాను గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు ముస్లింల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీలు ముత్తాబత్తుల ప్రశాంత్, బుడితి సత్యనారాయణమ్మ, సయ్యద్ వలీ, రాయుడు కృష్ణ మహేష్, అప్పన శ్రీను, కుసుమ శ్రీను, సూదాబత్తుల రాము, గంటి శ్రీరామచంద్రమూర్తి, కోట సత్తిబాబు, నందెపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో ముస్లిం సోదరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

జగన్ ప్రభుత్వంలో మైనార్టీ వర్గాల సంక్షేమం

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన, క్రైస్తవ, ముస్లిం మైనార్టీ వర్గాల సంక్షేమానికి అమలు చేసిన ప్రత్యేక పథకాలు ఆయా వర్గాల ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీనివాసపేట చిన్నమంద సహవాసం చర్చిలో మండలంలో ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్ అండ్ అసోసియేషన్స్ ఐక్య సమావేశం నిర్వహించారు. క్రైస్తవుడా సైనికుడా నీవు కదిలి రావోయి! చేయిచేయి కలుపుదాం.. పోరాడి హక్కులు సాధించుకుందాం! క్రైస్తవుల రాజకీయ ఆర్థిక అభివృద్ధి సాధికారిత కొరకు కలిసి పోరాడుదాం!! అనే నినాదంతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు చూపిన శాంతి, సహనం సమాజంలో అందరికీ ఆదర్శం కావాలన్నారు. ప్రేమ, దయ, కరుణ వంటి ఏసుక్రీస్తు గుణాలు, ఆయన సందేశాలు సమస్త మానవాళికి మార్గదర్శకమని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించడం ద్వారా ప్రపంచశాంతికి పాటుపడాలని కోరారు. నాటి సీఎం వైఎస్సార్ ఏసుక్రీస్తు కృపతో ప్రజారోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకం పెట్టి ధనికుడు ఏ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడో ఆ పక్క బెడ్‌పై పడుకుని వైద్యం పొందే అవకాశం పేదలకు కల్పించారన్నారు. నేడు ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని పేద, మధ్యతరగతి ప్రజల ఇంటికే పంపి వైద్యం చేయిస్తున్నారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. దానికి ఏసుప్రభువు ఆశీర్వాదమే అన్నారు. పాస్టర్స్‌కు గౌరవ వేతనం కల్పించి గౌరవించారన్నారు. అసోసియేషన్ తరఫున పలు కోర్కెలను జగ్గిరెడ్డి ముందుంచారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దానియేల్‌పాల్, చర్చి పాస్టర్ రెవ పల్లి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట పాస్టర్స్ ఐక్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కఠోర దీక్షతో జుమ్మతుల్ విదా ప్రార్థనలు



కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో జుమ్మా ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మామిడికుదురు మసీదులో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: పవిత్ర రంజాన్ నెలలో చివరి శుక్రవారం (జుమ్మతుల్ విదా) ప్రార్థనలు మసీదుల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కఠోర నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు చివరి శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మామిడికుదురు షియా జామియా మసీదులో షబ్బర్ అలీ జైదీ, సున్నీ జామియా మసీదులో తారిఖ్ అన్వర్ రజ్వీ చివరి శుక్రవారం ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు జుమ్మతుల్ విధా ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ నెలలో ఉపవాస దీక్షల ద్వారా పాపాల నుంచి పునీతులవుతారని చెప్పారు. అల్లా పట్ల భయం, భక్తి, పేదల పట్ల, పొరుగు వారి పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలన్నారు. అల్లా మాసంగా పిలిచే రంజాన్ నెలలో ధాన, ధర్మాలు చేయాలని సూచించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మసీదుల్లో ముస్లింలు 'జుమ్మతుల్ విదా' ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం ప్రపంచానికి అత్యంత పవిత్రమైన రోజు శుక్రవారం కాగా రంజాన్ మాసంలో నాలుగు శుక్రవారాలను కూడా గొప్పవిగా భావిస్తారు. ఇక రంజాన్‌మాసంలో వచ్చే చివరి శుక్రవారాన్ని అద్భుతమైనదిగా, ముక్తి ప్రసాదించే అత్యంత పుణ్యదాయకమైన మార్గమని ముస్లిం విశ్వాసం. రంజాన్ మాసంలో నాలుగో (ఆఖరి) శుక్రవారం. ఈ శుక్రవారం ప్రార్థనలను ఎన్ని అవాంతరాలు ఎదురైనా వదలకుండా తప్పక ఆచరిస్తామని ముస్లింలు తెలిపారు. మళ్లీ ఏడాది పాటు ఈ శుక్రవారం కోసం ఎదురుచూడాల్సి వుంటుంది. ప్రత్యేకంగా ఒక గడియ సమయంలో కోరుకున్న తమ కోర్కెలను అల్లాహ్ తప్పక అనుగ్రహిస్తాడని నమ్మకానికి అనుగుణంగా ముస్లింలు అజాన్ అయినప్పటి నుంచీ నమాజ్ పూర్తయ్యే వరకూ దైవచింతనతో గడిపారు. మండల ముస్లిం, మైనార్టీ నాయకుడు షేక్ గౌస్, మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ ఖాజాబాబు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఎంతో పవిత్రమైన ప్రధానమైన చివరి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు సందర్భంగా కుల, మత, వర్గాలకు అతీతంగా అందరూ బాగుండాలని, ముక్తిని ప్రసాదించాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్టు తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ రాజ్యం సాధ్యం

పి.గన్నవరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ ద్వారానే సంక్షేమ రాజ్యం సాధ్యమవుతుందని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. నగరం, పెదపట్నం గ్రామాల్లో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు భారీగా తరలి రాగా చైతన్య రథంపై ప్రజలకు ముకుళిత హస్తాలతో అభివాదం చేస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేర వేసే వలంటీర్ వ్యవస్థ కావాలో, ప్రజలను పీక్కుతినే జన్మభూమి కమిటీలు కావాల్లో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన నేత జగన్ అని, హామీలను తుంగలో తొక్కిన నేత చంద్రబాబు అని ఇద్దరిలో ఎవరికి అండగా నిలవాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలన చూసి ప్రతి ఒక్కరూ తమకు బాసటగా నిలవాలని కోరారు. ప్రచారంలో నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, కడలి శ్రీనివాస్, జాలెం అనూష, సజ్జాద్ హుస్సేన్, నూర్జైన్ అబ్బాస్, కటకంశెట్టి ఆదిత్య, పేరి శ్రీనివాస్, విత్తనాల శేఖర్, జక్కంపూడి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజునా పింఛన్ల పంపిణీ



కొత్తపేట సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కొత్తపేట: సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమం సెలవు రోజు అయినా శుక్రవారం కొనసాగింది. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ల పంపిణీకి చంద్రగ్రహణం పట్టడంతో ఆ కార్యక్రమం సచివాలయాల వద్దకు మారిన విషయం తెలిసిందే. గత రెండు రోజులుగా సచివాలయ సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం పబ్లిక్ హాలీడే కావడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు అయినా శుక్రవారం ఉదయం నుంచీ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో 95 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు.

అడ్డంకులను అధిగమించి పింఛన్ల పంపిణీ

మామిడికుదురు: ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీలు అడ్డుకున్నా సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రభుత్వం విజయవంతంగా పింఛన్లను పంపిణీ చేసింది. మూడు రోజుల్లోనే దాదాపుగా పెన్షన్లను లబ్ధిదారులకు అందించడంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రశంసలందుకున్నారు. మామిడికుదురు మండలంలో శుక్రవారం నాటికి 91.11 శాతం పింఛన్ల పంపిణీ చేశారు. మంచం పట్టిన వృద్ధులు, దీర్ఘ కాలిక రోగులు, దివ్యాంగుల ఇళ్లకు సచివాలయ ఉద్యోగులు స్వయంగా వెళ్లి పింఛన్లు అందించారు. మండలంలో మొత్తం 10,259 మందికి గాను 8,958 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అభయహస్తం పింఛన్లకు సంబంధించిన సొమ్ము విడుదల కావాల్సి ఉందని, రెండు రోజుల్లో వాటిని కూడా పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.



పెదపట్నంలంకలో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న ఉద్యోగి